సాక్షి
తూర్పుగోదావరి
శుక్రవారం | 2 | మే | 2025



పారిశ్రామిక శిక్షణ.. ఉపాధికి నిచ్చెన

పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్ని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. తద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు మార్గం సుగమమవుతుంది.


8లో



అటు కళ్యాణ శోభ... ఇటు బ్రహ్మోత్సవ ప్రభ

నిత్య కళ్యాణ కాంతుడైన భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి అయిదు రోజుల పాటు సాగే బ్రహ్మోత్సవాలు బ్రహ్మానందాన్ని ఇవ్వనున్నాయి.

సముద్రంలోకి 1,945 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి 1,945 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను గురువారం సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 8.70 అడుగులుగా నమోదైంది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

94.68 శాతం పింఛన్ల పంపిణీ



హుకుంపేటలో పింఛను పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లావ్యాప్తంగా గురువారం 94.68 శాతం మందికిఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. హుకుంపేట పంచాయతీ కాపుల పేటలో బెడ్ రిడెన్ అయిన చామకూరి నారాయణస్వామికి వృద్ధాప్య, బెజవాడ సత్యనారాయణకు దివ్యాంగ, మానేపల్లి జయకు వితంతు పింఛన్లను వారి ఇళ్ల వద్దనే ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా 2,34,576 మందికి రూ.102.08 కోట్ల మేర పింఛన్లు అందించాల్సి ఉండగా మధ్యాహ్నానికి 2,22,095 మందికి రూ.96.43 కోట్లు పంపిణీ చేశామని వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కేఎస్ జ్యోతి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓ పీఆర్ అండ్ ఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్, పంచాయతీ కార్యదర్శి కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు



సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో పెళ్లి బృందాల కోలాహలం

అన్నవరం: రత్నగిరికి గురువారం భక్తులు పోటెత్తారు. బుధవారం మధ్యాహ్నం, రాత్రి, గురువారం తెల్లవారుజామున రత్నగిరి పైన, ఇతర ప్రాంతాల్లోను పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవదంపతులు, వారి బంధుమిత్రులతో పాటు ఇతర భక్తులు కూడా తరలి రావడంతో సత్యదేవుని సన్నిధి కిటకిటలాడింది. స్వామివారి ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారిని 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సత్యదేవుని అన్న ప్రసాదాన్ని సుమారు 5 వేల మంది భక్తులు స్వీకరించారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, పరమేశ్వరుడు భక్తులకు నిజరూప దర్శనం ఇచ్చారు. రత్నగిరి వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి చండీహోమం నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్న భక్తులు రూ.750 టికెట్టుతో హోమంలో పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు.

అన్నదాతల ఆగ్రహం

- జిల్లాలో ఎక్కడి ధాన్యం అక్కడే..
- అయినా టార్గెట్ పూర్తయిందంటున్న అధికారులు, మిల్లర్లు
- జిల్లాలో ధాన్యం దిగుబడి అంచనా 5.20 లక్షల టన్నులు
- కొనుగోలు లక్ష్యం 2.50 లక్షల టన్నులే..
- మిగిలిన 2.70 లక్షల టన్నుల ధాన్యం ఏం చేయాలని ప్రశ్నిస్తున్న రైతులు
- పెరవలిలో రాస్తారోకో



పెరవలిలో జాతీయ రహదారిపై బైఠాయించిన రైతులు

పెరవలి: మేడే – అంతర్జాతీయ కార్మిక దినోత్సవం. సుదీర్ఘ పోరాటాల అనంతరం కార్మికులు కొన్ని హక్కులు సాధించుకున్న రోజు. సరిగ్గా ఇదే రోజున కూటమి సర్కారు విధానాలపై కడుపు మండిన కర్షకులు నిరసన బావుటా ఎగురవేశారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై అన్నదాతలు కన్నెర్రజేశారు. ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుని.. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పండించిన ధాన్యాన్ని.. ప్రభుత్వంకొనుగోలు చేయకపోవడంపై మండిపడ్డారు. ఎక్కడి ధాన్యం అక్కడే ఉండగా కొనుగోలు లక్ష్యం పూర్తయ్యిందంటూ అధికారులు, మిల్లర్ల నుంచి వస్తున్న సమాధానాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు చేస్తున్న అన్యాయంపై రగిలిన రైతన్నలు పెరవలి వద్ద గురువారం జాతీయ రహదారిని ధాన్యం ట్రాక్టర్లతో దిగ్బంధించారు. నడి రోడ్డుపై బైఠాయించి తీవ్ర స్థాయిలో నిరసన తెలిపారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వారి ఆందోళనతో రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో, స్పందించిన అధికారులు వారి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు.

దిగుబడి కొండంత.. కొనుగోలు గోరంత..

జిల్లా వ్యాప్తంగా 58,586 హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు రబీ వరి సాగు చేశారు. మొత్తం 5.20 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే, కొనుగోలు లక్ష్యం మాత్రం 2.50 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇంకా వరి కోతలు, మాసూళ్లు జరుగుతూనే ఉన్నాయి. గోపాలపురం, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో వరి కోతలు ఇంకా 50 శాతం జరగాల్సి ఉంది. మరోవైపు ఇప్పటికే కోతలు కోసి, మాసూళ్లు చేసిన ధాన్యం నిల్వలు కూడా ఎక్కడికక్కడే ఉన్నాయి. కొందరు రైతులు రోడ్ల పక్కన, ఏటిగట్లు, పుంత గట్లు చేలల్లో రాశులుగా, బస్తాల్లో ఉంచారు. ఇటువంటి పరిస్థితుల్లో ధాన్యం సేకరణ పూర్తయ్యిందని ఇటు అధికారులు, అటు మిల్లర్లు చెబుతూండటంతో రైతులు హతాశులవుతున్నారు. కొండంత దిగుబడి వస్తే గోరంత కూడా కొనుగోలు చేయకపోవడమేమిటని వారు నిలదీస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో ఇంకా 2.70 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉండిపోయింది. దీనిని అమ్ముదామని మిల్లులకు తీసుకుని వెళ్తే తమకిచ్చిన లక్ష్యం మేరకు ధాన్యం సేకరణ పూర్తయిందని మిల్లర్లు చెబుతున్నారు. రవాణా ఖర్చులు పెట్టుకుని, ధాన్యాన్ని ట్రాక్టర్లలో మిల్లుకు తీసుకుని వెళ్తే, గేట్లు తాళం వేసేస్తున్నారని, దీంతో తీసుకువెళ్లిన ధాన్యం ట్రాక్టర్లలోనే ఉంచాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ధాన్యం కొనే నాథుడే లేని నిస్సహాయతతో రైతుల్లో తలెత్తుతున్న ఆవేదన ఆగ్రహంగా మారుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి గింజా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి, ఆ మాట నిలబెట్టుకుందని, అప్పట్లో అధికారులు, ప్రభుత్వ సిబ్బంది చేల వద్దకే వచ్చి ధాన్యం సేకరించేవారని గుర్తు చేసుకుంటున్నారు. నేడు ఆ పరిస్థితి లేదని, పైగా, అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా కనికరించడం లేదని మండిపడుతున్నారు. మిగిలిపోయిన ధాన్యం ఎవరికి అమ్ముకోవాలో తెలియక నానా అగచాట్లూ పడుతున్నారు.



కాపవరం రోడ్డులో ధాన్యం బస్తాలు



కానూరు అగ్రహారంలో చేలో ధాన్యం బస్తాలు

మిల్లులో కొనలేమంటున్నారు



మిల్లు వద్దకు ధాన్యం పట్టుకెళ్తే సమాధానం చెప్పడం లేదు. పర్మిట్ ఇచ్చినా కొనలేమని అంటున్నారు. మిల్లు దగ్గర ట్రాక్టర్‌లోనే ధాన్యం ఉంది. ఏం చేయాలో తెలియడం లేదు. అధికారులు పట్టించుకోవటం లేదు.

– ఏలూరి వరప్రసాద్, వరి రైతు, కొత్తపల్లి అగ్రహారం, పెరవలి మండలం

మిల్లు గేటుకు తాళం వేశారు



ధాన్యం పట్టుకుని మిల్లుకు వెళ్తే, తమకు ఇచ్చిన టార్గెట్ పూర్తయ్యిందని, తాము కొనుగోలు చేయలేమని చెబుతున్నారు. మిల్లు గేట్లు మూసివేసి, తాళాలు వేశారు. అందుకే ధాన్యం ట్రాక్టర్‌ను జాతీయ రహదారిపై పెట్టి నిరసన తెలుపుతున్నాను. అంతకంటే ఏం చేయగలం?

– చిట్టీడి వీర వెంకట సత్యనారాయణ, వరి రైతు, పెరవలి

ఈ ధాన్యం ఏం చేయాలి?



అమ్ముదామంటే అడివి.. కొందామంటే కొరివి అన్న చందగా మారింది వరి రైతుల పరిస్థితి. ధాన్యం కొనలేమని అంటున్నారు. ఇప్పుడు ఈ ధాన్యం ఏం చేయాలి? మిల్లర్లు ముఖం చాటేస్తున్నారు. అందుకే రోడ్డెక్కాం.

– లొల్ల దానయ్య, వరి రైతు, కొత్తపల్లి అగ్రహారం

'నీట్'కు పకడ్బందీ ఏర్పాట్లు

- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు ముందుగానే చేరుకోవాలి
- 8 కేంద్రాల్లో 2,760 మంది హాజరు
- కలెక్టర్ ప్రశాంతి



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకూ జరిగే నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)ను జిల్లావ్యాప్తంగా అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. ఈ పరీక్షల నిర్వహణపై తన చాంబర్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడుతో కలిసి సమన్వయ శాఖల అధికారులతో శుక్రవారం ఆమె జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఒక్క నిమిషం ఆలస్యం అయినా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. విద్యార్థులు ముందుగానే ఆయా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 8 కేంద్రాల్లో 2,760 మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రశ్న, జవాబు పత్రాల రవాణా సమయంలో తగిన బందోబస్తు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణతో పాటు తాగునీటి సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు. జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ, పరీక్ష కేంద్రాల వద్ద ఈ నెల 3, 4 తేదీల్లో ఇంటర్నెట్, జిరాక్స్ షాపులు మూసివేయాలని ఆదేశించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ.. సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకూ అన్ని బస్ స్టేషన్ల నుంచి ఆయా పరీక్ష కేంద్రాలకు ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ జి.విజయలక్ష్మి, అదనపు ఎస్పీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సర్కార్.. రైతులను నట్టేట ముంచుతోంది

- ఎక్కువ పండించడం రైతుల నేరమా?
- తక్షణం ధాన్యం కొనుగోలు చేయాలి
- వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



అన్నదేవరపేటలో ధాన్యం రాశి వద్ద రైతులతో మాట్లాడుతున్న తలారి వెంకట్రావు

తాళ్లపూడి: 'ఎక్కువ పంట పండించడం నేరమా? పండించిన ధాన్యం కూడా కొనుగోలు చేయలేని చేతకాని చంద్రబాబు ప్రభుత్వం.. రైతులను నట్టేట ముంచుతోంది' అని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని అన్నదేవరపేట, గజ్జరం రోడ్డులో కొద్ది రోజులుగా కొనగోలు చేయని రబీ ధాన్యం రాశులు, బస్తాల వద్ద వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యాన ఆయన గురువారం నిరసన తెలిపారు. రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గంలో 27,778 ఎకరాల్లో రబీ వరి సాగు జరిగిందని, 1,16,667 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని తెలిపారు. ఇప్పటి వరకూ 46,667 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని అన్నారు. లక్ష్యంలో 40 శాతం మాత్రమే కొన్నారని, మిగిలిన ధాన్యం రైతుల వద్దనే చేలు, రోడ్లపై ఉందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు గోనెసంచులు కూడా ఇవ్వడం లేదని, తమ టార్గెట్ అయిపోయిందని మిల్లర్లు చెబుతున్నారని అన్నారు. ఎక్కువ పంట పండిందని అనడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేశామని గుర్తు చేశారు. గతంలో ఎన్టీఆర్, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా రైతుల పక్షాన పని చేశారని, కానీ చంద్రబాబు రైతులను నట్టేట ముంచుతున్నారని అన్నారు. వ్యవసాయం దండగన్న నాయకుడు చంద్రబాబు అని విమర్శించారు. ధాన్యం కొనలేమని పౌర సరఫరాల శాఖ మంత్రి చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం కొనకపోవడంతో రైతులను దళారులు దోచుకుంటున్నారని వెంకట్రావు చెప్పారు. ప్రభుత్వ మద్దతు ధర 75 కేజీల బస్తాకు రూ.1,725 ఉండగా, రూ.1,250 నుంచి రూ.1,300 వరకూ మాత్రమే కొంటున్నారని, ఫలితంగా రైతులు బస్తాకు రూ.400 నుంచి రూ.500 వరకూ నష్టపోతున్నారని అన్నారు. ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ నష్టపోతున్నారని తెలిపారు. రైతుల సమస్యపై ఆర్డీఓకు వినతిపత్రం ఇచ్చామని, తక్షణం ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని వెంకట్రావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొలిశెట్టి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గూడా విజయరాజు, జిల్లా కార్యదర్శి వంబోలు పోశిబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోదీది విభజించి, పాలించు విధానం

- కగార్ పేరుతో గిరిజనుల జీవితాలు నాశనం చేయొద్దు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్



సాక్షి, రాజమహేంద్రవరం/రాజమహేంద్రవరం సిటీ: ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, కులాలు, మతాల పేరుతో దేశాన్ని విభజించి పాలిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింహాచలం ఘటన దురదృష్టకరమని, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ అమరావతి సభ కోసం రాష్ట్రానికి మహారాజు వస్తున్నట్లుగా చంద్రబాబు హడావుడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడు 2014లో ముఖ్యమంత్రి అయినప్పుడు ప్రధాని రాష్ట్రానికి ఎలాంటి నిధులూ ఇవ్వలేదని, అమరావతి ప్రారంభానికి వచ్చినప్పుడు చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టి తీసుకొచ్చి రాష్ట్ర ప్రజలను అవమానించారని అన్నారు. అందుకే తరువాతి ఎన్నికల్లో చంద్రబాబు ఓడిపోయారని చెప్పారు. ప్రధాని పర్యటన సందర్భంగా తాము నిరసన తెలుపుతామని ప్రకటించారు.

పహల్గామ్ ఘటనను దేశంలోని అన్ని రాజకీయ పార్టీలూ తొలిసారి ప్రధాని మోదీకి అండగా నిలిచాయని, కానీ ఈ ఘటనను బీహార్, యూపీ ఎన్నికల్లో లబ్ధి కోసం వాడుకోవాలని ప్రధాని మోదీ చూస్తున్నారని నారాయణ ధ్వజమెత్తారు. మోదీకి ఎన్నికల మీద ఉన్న ప్రేమ దేశ భద్రతపై లేదని విమర్శించారు. పహల్గాం ఘటన జరిగిన తర్వాత మోదీ అఖిలపక్ష సమావేశానికి రాకుండా బిహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లడం తీవ్ర తప్పిదమని దుయ్యబట్టారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల ఏరివేత దారుణమని, ఆ పేరుతో అమాయక గిరిజనులను చంపుతున్నారని అన్నారు. అక్కడి సహజ వనరులను, గనులను అదానీకి అప్పగించేందుకే కగార్ డ్రామా ఆడుతున్నారని నారాయణ విమర్శించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా టైం ప్రకటించి మరీ మావోయిస్టులను చంపడమే లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. దేశ రక్షణ కంటే మావోయిస్టుల నిర్మూలన పైనే దృష్టి పెట్టారని, అందుకే పహల్గాం ఘటన జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కుల గణనకు ఆమోదం తెలపడం మంచి పరిణామమని చెప్పారు. అయితే, నిర్దిష్ట కాలపరిమితితో కులగణనను ప్రకటించకపోవడం కేంద్రం చేస్తున్న మరో మోసమని విమర్శించారు.

కేంద్రంలో బీజేపీ వచ్చాక కార్మిక హక్కులు హరించుకుపోయాయని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల హక్కుల కోసం పోరాడాల్సిన దుస్థితి వచ్చిందని అన్నారు.

కార్మికుల గురించి ఆలోచించే పార్టీ వైఎస్సార్ సీపీ

- ఈఎస్ఐ ఆసుపత్రిని రూ.100 కోట్లతో అభివృద్ధి చేశా
- సౌకర్యాల కల్పనకు ప్రస్తుత ప్రభుత్వం శ్రద్ధ చూపాలి
- మాజీ ఎంపీ భరత్‌రామ్



మేడే ర్యాలీలో పాల్గొన్న గౌతమ్‌రెడ్డి, మార్గాని భరత్‌రామ్ తదితరులు



సభలో ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ భరత్‌రామ్. చిత్రంలో గౌతమ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: కార్మికుల సంక్షేమం గురించి ఆలోచించే పార్టీ వైఎస్సార్ సీపీయేనని మాజీ ఎంపీ, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. కార్మిక శక్తి లేనిదే దేశాభివృద్ధి లేదన్నారు. మేడే సందర్భంగా భరత్‌రామ్ నేతృత్వంలో ట్రేడ్ యూనియన్ నాయకుడు వాసంశెట్టి గంగాధరరావు, సప్పా ఆదినారాయణ ఆధ్వర్యాన స్థానిక కోటగుమ్మం సెంటర్‌లోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం నుంచి డీలక్స్ సెంటర్ వరకూ కార్మికులతో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటగుమ్మం సెంటర్‌లో కార్మికులనుద్దేశించి భరత్‌రామ్ మాట్లాడుతూ, పేరులోనే 'శ్రామిక' ఇమిడి ఉన్న పార్టీ వైఎస్సార్ సీపీ అని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో రెండున్నరేళ్లు కరోనాతో పోయిందని, మిగిలిన రెండున్నరేళ్ల నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో చేయదగిన రీతిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశానని చెప్పారు. ఒకప్పుడు వర్షం వస్తే వైద్యం చేయడానికి వీలు లేని పరిస్థితుల్లో ఉన్న ఈఎస్ఐ ఆసుపత్రిని కేంద్ర ప్రభుత్వంతో పోరాడి రూ.100 కోట్లతో 100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దామని గుర్తు చేశారు. అక్కడ సౌకర్యాల కల్పన, సిబ్బంది నియామకం వంటి విషయాలపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. విమర్శించడం కోసమో మరో దానికో కాకుండా గత జగన్ ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడా గమనించాలని కోరారు. అందరి ఆశీస్సులతో వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, జగన్ సీఎం అవుతారని భరత్‌రామ్ ధీమా వ్యక్తం చేశారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ, పాదయాత్ర చేసి, ప్రజల కష్టాలు స్వయంగా చూసిన జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని చెప్పారు. పారిశుధ్య కార్మికుల జీతాలను రూ.9 వేల నుంచి రూ.20 వేలకు పెంచారన్నారు. అలాగే, ఆటో కార్మికులకు, దర్జీల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున జమ చేశారన్నారు. చేనేత కార్మికుల ఖాతాల్లో రూ.24 వేలు వేశారన్నారు. అందువల్లనే జగన్ హయాంలో కార్మిక ఉద్యమాలు లేవని చెప్పారు. ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు.. కార్మికుల హక్కులు కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. కులమత వర్గాలకు అతీతంగా భరత్‌రామ్ నాయకత్వంలో మే 20న జరిగే నిరసన కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని గౌతమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు, వైఎస్సార్ సీపీ నగర నాయకులు కానుబోయిన సాగర్, మజ్జి అప్పారావు, దాసి వెంకటరావు, సంకిస భవానీప్రియ, కాటం రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వర్గానికి అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఘనంగా మేడే వేడుకలు





సభలో మాట్లాడుతున్న గౌతమ్‌రెడ్డి. కార్మికులను సత్కరిస్తున్న జక్కంపూడి రాజా, విజయలక్ష్మి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: కార్మికుల అండదండలతోనే తన తండ్రి జక్కంపూడి రామ్మోహనరావు మంత్రి స్థాయికి ఎదిగారని, అందువల్లనే కార్మిక వర్గానికి తమ కుటుంబం ఎల్లవేళలా కృతజ్ఞతగా, అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. తాడిటోటలోని సంహిత కన్వెన్షన్‌లో గురువారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విభిన్న రంగాలకు చెందిన కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ, చిన్న, పెద్ద అనే తేడా లేకుండా కార్మికులెవరికి కష్టం వచ్చినా, ఏ సమస్య వచ్చినా తప్పకుండ అండగా నిలిచి, పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్మిక సంఘాలను కూడా బలోపేతం చేసుకోవాల్సి ఉందని, దానిపై దృష్టి పెడతామని అన్నారు.

గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ, కార్మికుడు అంటేనే జక్కంపూడి, జక్కంపూడి అంటేనే కార్మికుడు అనేంతగా కార్మిక వర్గంతో జక్కంపూడి కుటుంబానికి అనుబంధం పెనవేసుకుందన్నారు. జక్కంపూడి రామ్మోహనరావు మాదిరిగానే జక్కంపూడి రాజాను కూడా ఆదరించాలని కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్మిక పక్షపాతి అని చెప్పారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాస్తూ, రాష్ట్రంలో చంద్రబాబు, కేంద్రంలో మోదీ ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకు వస్తోందని, దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కోట్లాదిగా ప్రజానీకం రోడ్ల పైకి వస్తుందని, కుల మత వర్గాలకు అతీతంగా మే 20న జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్మికులకు ఏ సమస్య వచ్చినా ఐక్యంగా పోరాడాలని అన్నారు. దేవుడి పేరుతో నాటకాలాడితే మట్టి కొట్టుకుపోవడం ఖాయమని హెచ్చరించారు. సింహాచలంలో కూలిపోయే గోడ కట్టి ఏడుగురిని బలి తీసుకున్నారని, తిరుపతిలో తొక్కిసలాటలో పలువురు ప్రాణాలు కోల్పోయారని, గోదావరి పుష్కరాల్లో 29 మంది ప్రాణాలు కోల్పోయారని, వీటన్నింటికీ మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు.

వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శత్రువు, మిత్రుడు అనే తేడా లేకుండా తన భర్త జక్కంపూడి రామ్మోహనరావు పని చేశారన్నారు. ఓడిపోయి మనం ఏమీ కోల్పోలేదని, నెగ్గిన వాళ్లు ఏమీ చేయలేకపోతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వ నేతలు సంపద సృష్టించకుండా, కొల్లగొడుతున్నారని ధ్వజమెత్తారు. రాబోయే ప్రభుత్వం మనదేనని, మళ్లీ స్వర్ణయుగం చూస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, నాయకులు గెద్దం రమణ, నందెపు శ్రీను, కేఎల్ఎన్ రెడ్డి, భవన నిర్మాణ, ఆటో, హోటల్ యూనియన్ల కార్మికులు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు అభినందన



వినయ్‌ను సత్కరిస్తున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం కాతేరులోని తమ తిరుమల విద్యాసంస్థలో చదువుకున్న దొమ్మేటి వినయ్ సివిల్స్‌లో ఆలిండియా 274వ ర్యాంకు సాధించాడని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వినయ్ తల్లిదండ్రులు జగదీష్, కనకదుర్గ, అన్నయ్య సాయిసంతోష్‌లతో కలిసి క్యాంపస్‌కు గురువారం వచ్చారు. ఈసందర్భంగా నున్న తిరుమలరావు వినయ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి, దుశ్శాలువాతో సత్కరించారు. తిరుమలరావు మాట్లాడుతూ ఈ విద్యార్థి ఇంటర్మీడియెట్ తమ విద్యాసంస్థలో చదివి ఎన్ఐటీ దుర్గాపూర్‌లో ఇంజినీరింగ్ సీటు సాధించాడన్నారు. బీటెక్ చదివిన తరువాత యూపీఎస్సీ పరీక్ష రాసి సివిల్స్‌లో ఈర్యాంకు సాధించాడని తెలిపారు. వినయ్ మాట్లాడుతూ తిరుమలరావు సర్ ఇచ్చిన కౌన్సెలింగ్, ఈ క్యాంపస్‌లో చెప్పే విలువలతో కూడిన విద్య తనకు ఎంతగానో ఉపయోగపడ్డాయని అన్నారు. తనకు వచ్చిన ఈ ర్యాంకుకు ఐఆర్ఎస్ కస్టమ్స్‌లో రావచ్చని, సివిల్స్‌లో మరొక ప్రయత్నం చేసి కలెక్టర్ అవ్వాలన్నది లక్ష్యమని తెలిపారు. అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి వినయ్‌ను అభినందించారు.

పారిశ్రామిక శిక్షణ.. ఉపాధికి నిచ్చెన

- ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- 10వ తరగతి అర్హతతో ప్రవేశాలు
- వివిధ ట్రేడుల్లో అడ్మిషన్లకు ఈ నెల 24 తుది గడువు

రాయవరం/బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్ని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. తద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు మార్గం సుగమమవుతుంది. ఇదే ఉద్దేశంతో సాంకేతిక విద్యాశాఖ, పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఇండస్ట్రియల్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్)లు ఏర్పాటయ్యాయి. ఐటీఐ కోర్సు పూర్తి కాగానే విద్యార్థులు అప్రెంటిస్ చేస్తున్నారు. ప్రతిభతో అవకాశాలు దక్కించుకుంటున్నారు. ప్రస్తుతం ఐటీఐ కళాశాలల్లో వివిధ ట్రేడుల్లో అడ్మిషన్లకు ఈ నెల 24 తుది గడువుగా నిర్ణయించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైన నేపథ్యంలో ఐటీఐలు, వాటిలో ఉన్న సీట్లు, ట్రేడ్స్ తదితర విషయాలతో 'సాక్షి' కథనం.

అధిక శాతం ఇంటర్‌లో..

పదో తరగతి పూర్తి కాగానే విద్యార్థులు ఏ కోర్సులో చేరాలా అంటూ ఆలోచన చేస్తారు. అధిక శాతం మంది ఇంటర్మీడియెట్‌లో చేరుతారు. సాంకేతిక విద్య ద్వారా త్వరగా జీవితంలో సెటిల్ అవ్వాలనుకునే వారు పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులకు ప్రాధాన్యమిస్తారు. పదవ తరగతి పూర్తి చేయగానే త్వరితగతిన ఉపాధి పొందేందుకు ఐటీఐలు ఒక చక్కని బాటను ఏర్పాటు చేస్తాయని సాంకేతిక నిపుణులు చెబుతారు. సాంకేతిక కోర్సుల్లో ఇంటర్ ఒకేషనల్, పాలిటెక్నిక్ కోర్సులతో పాటు పలువురు విద్యార్థులు ఐటీఐకి ప్రాధాన్యమిస్తున్నారు.

18 ఏళ్లు దాటగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

ఐటీఐ పూర్తిచేసిన తర్వాత విద్యార్థులు అప్రెంటిస్ పూర్తి చేసుకుంటే 18 ఏళ్లు దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు పొందడానికి అవకాశం ఉంటుంది. విద్యుత్, రైల్వే, రక్షణ, పలు ప్రభుత్వ, ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో ఐటీఐ పూర్తిచేసిన వారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అయితే స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలి. ఆయా ట్రేడుల్లో నైపుణ్యం సంపాదించిన విద్యార్థులకు ఉపాధి తప్పనిసరిగా లభిస్తుందనడంలో సందేహం లేదు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఐటీఐల్లో స్కిల్ హబ్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇస్తోంది. ఉద్యోగం, ఉపాధితో పాటు స్వయం ఉపాధికి సైతం ఐటీఐ దోహదపడుతుంది.



కాకినాడలోని ప్రభుత్వ ఐటీఐ

పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలు లేవు. కాకినాడ జిల్లాలో మాత్రమే రెండు ఉన్నాయి. కోనసీమ జిల్లాలో ప్రైవేటు యాజమాన్యంలో 15 ఐటీఐలు ఉండగా, వీటిలో ఏడాది, రెండేళ్ల కాల పరిమితితో 2,564 సీట్లు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 12 ప్రైవేట్ యాజమాన్యంలో 1,704 సీట్లు ఉన్నాయి. కాకినాడ జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలలో 728 సీట్లు ఉన్నాయి. కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీ ఐల్లో ప్రవేశం పొందే విద్యార్థులకు 4,998 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఏడాది, రెండేళ్ల వ్యవధితో రెగ్యులర్ కోర్సులు

ఐటీఐల్లో ఏడాది, రెండేళ్ల కాలపరిమితికి రెగ్యులర్ కోర్సులు ఉంటాయి. రెండేళ్ల కాలపరిమితితో ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్, మెకానికల్, డ్రాఫ్ట్స్ మెన్ సివిల్, ఇనుస్ట్రుమెంటేషన్ మెకానికల్ వంటి కోర్సులు ఉంటాయి. ఏడాది కాలపరిమితితో డీజిల్ మెకానిక్, వెల్డర్, కటింగ్ అండ్ సూయింగ్, కంప్యూటర్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ కోర్సులు ఉంటాయి. ఐటీఐల్లో చేరగోరే విద్యార్థులు వారికి ఆసక్తి ఉన్న కోర్సులు ఏ ఏ ఐటీఐల్లో ఉన్నాయో వెళ్లి పరిశీలించుకోవాలి. దరఖాస్తుల పరిశీలన పూర్తయిన విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హత సాధిస్తారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే తరగతుల ప్రవేశానికి షెడ్యూల్ విడుదల చేస్తారు.

రెండేళ్ల కాల పరిమితి కోర్సులు

ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్ మెన్ సివిల్, ఆర్అండ్స్ టెక్నాలజీ, మెకానికల్ మోటార్ వెహికల్, ఎల్రక్ట్రానిక్ మెకానిక్, ఇనుస్ట్రుమెంట్ మెకానిక్, టర్నర్

ఏడాది కాల పరిమితి కోర్సులు

మెకానిక్ డీజిల్, సీవోపీఏ, వెల్డర్, సూయింగ్ టెక్నాలజీ, పీపీవో

డ్రోన్ టెక్నాలజీపై స్వల్పకాలిక కోర్సు

గతేడాది కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో డ్రోన్ టెక్నాలజీపై ఆరు నెలల వ్యవధి గల కోర్సును ప్రవేశపెట్టారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో 20 సీట్లు ఉన్న ఈ కోర్సును ప్రారంభించారు. వ్యవసాయం, సర్వే, షూటింగ్స్ డ్రోన్ టెక్నాలజీ వినియోగం పెరిగిన నేపథ్యంలో ఐటీఐల్లో డ్రోన్ టెక్నాలజీ కోర్సును ప్రవేశ పెట్టారు. అందులో భాగంగా కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

పాలిటెక్నిక్‌లోనూ చేరవచ్చు..

ఐటీఐలో రెండేళ్ల వ్యవధి ఉన్న కోర్సులు పూర్తి చేసిన వారికి పాలిటెక్నిక్‌లోనూ చేరేందుకు అవకాశం ఉంటుంది. ఇందుకు ప్రత్యేకంగా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఐటీఐ పూర్తి చేసినవారికి పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో బ్రిడ్జి కోర్సు ద్వారా ప్రవేశం పొందేందుకు అవకాశం ఉంది. పాలిటెక్నిక్ పూర్తి చేసినవారు బీటెక్‌లో ప్రవేశం పొందవచ్చు. ఈ విధంగా ఏటా పలువురు లేటరల్ ఎంట్రీని పొంది. ఉన్నత విద్యను అభ్యసించి, ఉద్యోగావకాశాలను పొందుతున్నారు.



ఐటీఐలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు (ఫైల్)

నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన



ఐటీఐల్లో ప్రవేశాలకు నిర్ణీత గడువులోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కోర్సును పూర్తి చేసిన వారికి మంచి అవకాశాలు ఉంటున్నాయి. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నూతన సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలను దరఖాస్తుదారుల మొబైల్ నంబరుకు పంపిస్తాం. పదో తరగతిలో విద్యార్థి పొందిన మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం అడ్మిషన్స్ ఉంటాయి.

–ఎంవీజీ వర్మ, కాకినాడ, కోనసీమ జిల్లాల ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్, కాకినాడ

రూ.12.50 లక్షల విలువైన బంగారం స్వాధీనం


ముగ్గురు దొంగల అరెస్టు



దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు వస్తువులు

మామిడికుదురు: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పలు దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు దొంగల ముఠాను నగరం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.12.50 లక్షల విలువైన 133 గ్రాముల బంగారం, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. నగరం పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు, నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ ఈ చోరీలకు సంబంధించిన వివరాలను తెలిపారు. ఆలమూరు మండలం ఇంద్రీగోపేటకు చెందిన వాసంశెట్టి వీరబాబు, గువ్వల చంద్రశేఖర్, పెదపళ్లకు చెందిన కుడుపూడి నాగరాజులను అరెస్టు చేశామన్నారు. ఈ చోరీ కేసుల్లో మరో నిందితుడు గుత్తుల సుభాష్ పరారీలో ఉన్నాడని చెప్పారు. వీరిపై నగరం, తాడేపల్లిగూడెం, తడికలపూడి, ద్వారకా తిరుమల, దేవరపల్లి, దెందులూరు, పెరవలి, జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్లలో పలు దొంగతనం కేసులు నమోదయ్యాయన్నారు. వీరు చైన్ స్నాచింగ్‌లతో పాటు మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడతారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో బంగారం అమ్మేందుకు వెళ్తుండగా వీరిపై అనుమానం వచ్చి నగరం ఎస్సై చైతన్యకుమార్ అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా చోరీ నేరాల గుట్టు రట్టు అయ్యిందన్నారు. దొంగలను పట్టుకోవడంతో చాకచక్యంగా పనిచేసిన సీఐలు భీమరాజు, గజేంద్ర (సీసీఎస్), ఎస్సైలు చైతన్యకుమార్, పరదేశి, కానిస్టేబుళ్లు కృష్ణసాయి, శ్రీను, దుర్గాప్రసాద్, అర్జునరావు, సుభాకర్, బ్లెస్సన్‌ను ఎస్పీ కృష్ణారావు అభినందించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,000
గటగట (వెయ్యి)	18,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ఎనిమిది మందికి కారుణ్య నియామకాలు



కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, సీఈవో లక్ష్మణరావు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ ఆధ్వర్యంలోని పాఠశాలలు, ఇతర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తూ ఆకస్మికంగా చనిపోయిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలను జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు గురువారం నిర్వహించారు. మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద ఏడుగురికి జూనియర్ అసిస్టెంట్ పోస్టులను, ఒకరికి ఆఫీసు సబార్డినేట్, చాలాకాలంగా రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఇద్దరిలో ఒక డ్రైవరికి జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ విప్పర్తి మాట్లాడుతూ కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఎనిమిది మందికి కారుణ్య నియామకాలు, ముగ్గురికి పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. జీఎస్ రాంగోపాల్, ఏపీ పంచాయతీరాజ్ మంత్రిత్వ సిబ్బంది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌వీవీ రమేష్, పరిపాలనాధికారి వీహెచ్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

సాగర తీరాన క్రీడా సంబరం

- నేటి నుంచి మూడు రోజులపాటు బీచ్ కబడ్డీ పోటీలు
- రాష్ట్రంలో 13 జిల్లాల నుంచి క్రీడాకారుల రాక
- సీనియర్ మహిళలు, పురుషుల విభాగాల్లో పోటీలు



కాకినాడ సూర్యారావుపేట వద్ద బీచ్ కబడ్డీ పోటీలకు సిద్ధమైన క్రీడా ప్రాంగణం

కాకినాడ రూరల్: కాకినాడ సాగర తీరం క్రీడా సంబరానికి వేదిక అయ్యింది. ఏపీ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 12వ రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ అండ్ వుమెన్స్ కబడ్డీ పోటీలు రూరల్ మండలం సూర్యారావుపేట న్యూ ఎన్టీఆర్ బీచ్‌లో శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఫ్లడ్ లైట్ల వెలుతురులో సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు కబడ్డీ పోటీలు కనువిందు చేయనున్నాయి. ఇందుకు కోసం నాలుగు కోర్టులను ఏర్పాటు చేశారు. లీగ్ కమ్ నాకౌట్ దశలో జరగనున్న కబడ్డీ పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కానున్నారు. పోటీలు మూడురోజులు జరుగుతాయి. రోజుకు 15నుంచి సుమారు 20మ్యాచ్‌లు వరకు జరగనున్నాయి. ఒక్కో జట్టులో నలుగురేసి క్రీడాకారులు తలపడనున్నారు. పూర్వపు ఉమ్మడి జిల్లాల ప్రతిపాదికన క్రీడా జట్లు పోటీలలో ప్రాతినిధ్యం వహిస్తుండడంతో 13జిల్లాల నుంచి 13పురుషుల జట్లు, 13మహిళల జట్లు హాజరవుతున్నాయి. పురుషుల జట్లుకు సూర్యారావుపేట జెడ్పీ హైస్కూల్, మహిళలకు వాకలపూడి హైస్కూల్‌లో వసతి, భోజన సదుపాయం కల్పించారు.

చెట్టు కూలి వ్యక్తి మృతి



రవికుమార్ మృతదేహం

కొవ్వూరు: పట్టణంలో వేములూరు-దీప్తీ స్కూలు రోడ్డు మార్గంలో ఈదురు గాలుల ప్రభావానికి చెట్టు కూలి మోటారు సైకిలిస్టుపై పడడంతో వేములూరు గ్రామానికి చెందిన చిన్న రవి కుమార్ (49) మృతిచెందారు. బుధవారం రాత్రి స్నేహితుడు అత్తిలి చంద్రరావుతో కలిసి మోటారుసైకిల్‌పై రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో బలమైన ఈదురుగాలులు వీచి రవికుమార్ నడుపుతున్న మోటారు సైకిల్‌పై చెట్టు పడింది. బలమైన గాయాలు కావడంతో రవికుమార్ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. వెనుక కూర్చోన్న చంద్రరావుకి తీవ్ర గాయాలు కావడంతో రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్ సత్యనారాయణ తెలిపారు. మృతుడు అవంతీ ఫీడ్స్ ఫ్యాక్టరీలో వర్కర్‌గా పనిచేస్తున్నారు. రవి కుమార్‌కి భార్య, కుమారుడు ఉన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకులపై కేసులు

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా ఎక్సైజ్ పరిధిలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అధికారులు కాకినాడ అర్బన్, ప్రత్తిపాడు, పిఠాపురం, తుని, పెద్దాపురంలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేశారు.

అటు కళ్యాణ శోభ... ఇటు బ్రహ్మోత్సవ ప్రభ

- వీరేశ్వరస్వామి ఆలయంలో ఆరంభమైన బ్రహ్మోత్సవాలు
- అయిదు రోజులపాటు అలరించనున్న ఆధ్యాత్మిక సంబరాలు



వీరేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం



భద్రకాళీ సమేత వీరేశ్వరునికి పంచామృత అభిషేకం

ఐ.పోలవరం: నిత్య కళ్యాణ కాంతుడైన భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి అయిదు రోజుల పాటు సాగే బ్రహ్మోత్సవాలు బ్రహ్మానందాన్ని ఇవ్వనున్నాయి. తమ గోత్ర నామాలతో స్వామి ముందు కూర్చుని కల్యాణాలు చేయించుకుంటూ ధన్యమయ్యే భక్తులు మురమళ్ల పుణ్య క్షేత్రంలో కన్నుల పండువగా జరగనున్న స్వామి బ్రహ్మత్సవాల్లో పాల్గొననున్నారు. ఆలయంలో బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఇందుకు నాందిగా గ్రామంలోని మహిళలు ఆలయ ఆవరణలో పసుపు కొమ్ములను రోకట్లో కొట్టి బ్రహ్మోత్సవాలకు శుభాన్ని అద్దారు. శైవాగమ పద్ధతిలో స్వర్ణ రుద్రాక్ష కంకణ, స్వర్ణ సింహతలాట సన్మాన గ్రహీత, రాష్ట్ర ఆదిశైవ అర్చక సంఘ అధ్యక్షుడు యనమండ్ర సత్యసీతారామ శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చక స్వాముల, అధికారుల పర్యవేక్షణలో ఈ అయిదు రోజుల క్రతువుకు శ్రీకారం చుట్టారు. ఆలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, స్వామి వారికి పంచామృత అభిషేకం, స్వామి, అమ్మవార్లను నూతన వధూవరులను చేసే కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పండితులు పంచామృతాలతో స్వామి వారికి, అమ్మవారికి స్నానాలు చేయించారు. బ్రహ్మోత్సవ కల్యాణ మూర్తులకు జంపన రామకృష్ణంరాజు దంపతులు అర్చకస్వాములకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, స్వామి వారిని, అమ్మవారిని భద్రపీఠంపై ఉంచి ప్రత్యేక అలంకరణలో గ్రామోత్సవాన్ని కన్నుల వైకుంఠంగా నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వీరేశ్వరుని కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఈ కల్యాణ మహోత్సవంలో ఎదురు సన్నాహం, ద్వాదశ ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దంపతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీ నారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టీడీపీ నేతల కవ్వింపు చర్యలు

- మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిపై దాడికి యత్నం
- పెదపూడిలో కారును అడ్డగించడంతో ఉద్రిక్త పరిస్థితులు



పెదపూడిలో మాజీ ఎమ్మెల్యే కారును దౌర్జన్యంగా అడ్డుకుంటున్న టీడీపీ నాయకులు

పెదపూడి: గ్రామంలో టీడీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. గురువారం రాత్రి దోమాడ గ్రామం నుంచి అనపర్తి వెళుతున్న వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి కారును టీడీపీ నాయకులు అడ్డగించి దాడికి ప్రయత్నించారు. కొంతమంది కారు ముందు కూర్చుని కారును కదలనివ్వలేదు. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి వెంట వైఎస్సార్ సీపీ నాయకులు రావడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కొంత సమయం తరువాత తీవ్ర ఉద్రిక్తతల నడుమ మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి కారులో వెళ్లిపోయారు. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దోమాడ గ్రామంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు బియ్యం పంపిణీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడి అనపర్తి బయలు దేరారు. ఈలోపుగా మాజీ ఎమ్మెల్యేను అడ్డగించడానికి పెదపూడి మార్కెట్ సెంటర్‌లో టీడీపీ నాయకులు మోహరించారు. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కారులో వస్తుండగా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. వెంటనే మాజీ ఎమ్మెల్యే కారులోంచి కిందకు దిగాలని పట్టుబట్టారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులపై వ్యాఖ్యలు చేస్తున్నారంటూ కారుపై దాడికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో దోమాడ గ్రామంలో గృహాలు కోల్పోయిన బాధిత మహిళలు, నాయకులు, ప్రజలు ఒక్కసారిగా పెద్ద ఎత్తున మార్కెట్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ టీడీపీ, వైఎస్సార్ సీపీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. కొంతసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు అక్కడకు చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి కారులో వెళ్లిపోయారు. మాజీ ఎమ్మెల్యేకు దళిత, ప్రజా సంఘాల నాయకులు, దోమాడ గ్రామంలో ఇళ్లు కోల్పోయిన బాధితులు పెద్ద ఎత్తున అండగా నిలిచారు.

'రామకృష్ణారెడ్డి.. నీ హత్యా రాజకీయాలకు భయపడను'

'ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి.. నీ హత్యా రాజకీయాలకు నేను భయపడను' అని వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమాడ గ్రామంలో బాధితులకు సాయం చేసి వస్తే నీ టీడీపీ గూండాలు, రౌడీలను పంపించావా అని దుయ్యబట్టారు. ఖబడ్దార్ రామకృష్ణారెడ్డి.. ఎన్ని హత్యా ప్రయత్నాలు చేసినా నీ అవినీతి అక్రమాలను ఎండగడుతూనే ఉంటాను. నీ అక్రమాలపై ప్రశ్నిస్తూనే ఉంటాను. నాకు అండగా, రక్షణగా నిలిచిన దళిత ప్రజా సంఘాల నాయకులు కొండబాబు, ఆదినారాయణ, ఏనుగుపల్లి కృష్ణ, దోమాడ బాధితులు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.